క్లుప్తంగా

రూ.లక్ష విలువైన స్టీలు సామగ్రి అందజేత



స్వామీజీకి స్టీలు సామగ్రిని అందజేస్తున్న శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు

అనపర్తి: రాజమహేంద్రవరం రామకృష్ణ మఠానికి అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి రూ.లక్ష విలువైన స్టీలు సామగ్రిని సమకూర్చింది. బుధవారం అనపర్తికి చెందిన రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సమితి కార్యదర్శులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డిలు రాజమహేంద్రవరం చేరుకుని రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్‌కు 500 స్టీలు భోజనం ప్లేట్లు, 500 గ్లాసులు, 2 హాట్ బాక్సులు అందజేశారు. మఠంలో నిర్వహించే అన్నప్రసాద వితరణకు ఈ భోజన సామగ్రిని వినియోగిస్తామని స్వామీజీ తెలిపారు.

పెదపూడి ఎస్‌ఐ వాసుకు ప్రశంసా పత్రం



ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్‌ఐ వాసు

పెదపూడి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను కాకినాడ జిల్లా ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ జి.ప్రేమ్ కాజల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నానని పెదపూడి ఎస్‌ఐ పి.వాసు బుధవారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు సక్రమంగా నిర్వహించడం, కేసులు పెండింగ్‌లో లేకుండా చూడడం, ఇటీవల లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అవ్వడానికి కృషి చేసినందుకు తనకు బెస్ట్ సర్వీసు అవార్డు లభించిందని ఎస్‌ఐ చెప్పారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వాసుకు పలువురు అభినందనలు తెలిపారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రులు మంగళవారం రాత్రితో ముగిశాయి. బుధవారం అర్చకులు రమణశర్మ, శ్రీనివాస శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనతో సహా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో దేవీ సప్తశతి, వారాహి సహస్రనామం, లలితా సహస్రనామం పారాయణ చేయించారు. పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

పెదపూడి: జులై 10, 11 తేదీల్లో చేపట్టే జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలిండియా అంగన్‌వాడీ అసోసియేషన్ ప్రతినిధి జి.బేబిరాణి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహిస్తున్న జీపు జాతా బుధవారం పెదపూడి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బేబిరాణి మాట్లాడుతూ కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా 36 గంటలపాటు వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శేషుబాబ్జి, మండల నాయకురాలు ఎం.రాజేశ్వరి, వి.భారతి, ఎ.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో స్టూడియోలో చోరీ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో శ్రీదేవి 4కే స్టూడియోలో చోరీ జరిగిందని ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బలభద్రపురంలో తాడి విజయ్‌కుమార్ స్టూడియో నడుపుతున్నారు. ఈ నెల 26వ తేదీన స్టూడియోకి తాళం వేసి ఇంటికి వెళ్లి మరుసటి రోజు వచ్చి చూసేసరికి కెమెరాతో పాటు ఇతర సామాన్లు దొంగిలినట్లుగా గుర్తించారు. విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

మెడికో మృతిపై అనుమానాలు

రాజానగరం: స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో పీజీ చేస్తున్న మెడికో మృతిపై పలువురు రకరకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తెనాలికి చెందిన ఈ మెడికో కొండూరు శ్రీకృష్ణకేథార్ ఎంబీబీఎస్ కూడా ఇదే కళాశాలలో చదివి ఉండటంతో అతని ప్రవర్తన గురించి తెలుసున్న వారంతా 'గుడ్' సర్టిఫికెట్ ఇస్తున్నారే తప్ప ఏ ఒక్కరూ చెడుగా చెప్పడం లేదు. కళాశాల వైద్యులు నివాసం ఉండే స్టాఫ్ క్వార్టర్స్‌లోనే ఉంటూ పీజీ చేస్తున్న అతను మంగళవారం ఉదయం ఆ క్వార్టర్స్‌కి సమీపంలోని కారిడార్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి విదితమే. మృతుని ముక్కు, చెవుల నుంచి రక్త కారడం, శరీరంపై గాయాలు, కవుకు దెబ్బలు ఉండటంతో అతని మృతి అనుమానాలకు తావిస్తోంది. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం పోస్టుమార్టమ్ చేయించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని కేసు దర్యాప్తు చేస్తున్న రాజానగరం సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మృతికి గల కారణాల గురించి ప్రశ్నించగా పోస్టుమార్టమ్ రిపోర్టు రావలసి ఉందన్నారు.

పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ

- 117 ఆలయాల నిర్మాణానికి చర్యలు
- చురుగ్గా శంకుస్థాపనలు

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కృషితో చురుగ్గా ఆలయాలను పునర్నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే పలు గ్రామాల్లో శంకుస్థాపనలు, భూమిపూజ జరిగాయి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 117 దేవాలయాల నిర్మాణానికి కసరత్తు మొదలైంది. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు సౌజన్యంతో ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయాల పునర్నిర్మాణ పనులతో పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పలుచోట్ల శంకుస్థాపనలు జోరుగా జరుగుతున్నాయి. ఆలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు సౌజన్యంతో చర్యలు చేపట్టారు. ఒక్కో దేవాలయానికి రూ.10 లక్షలు కేటాయించారు.

అభివృద్ధి పథంలో..

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ప్రజలకు కావాల్సిన అన్ని వసతులు, సౌకర్యాలను కల్పిస్తున్నారు. రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పరిపాలన ప్రజలకు ముంగిటకు చేరింది. టీడీపీ హయంలో జన్మభూమి కమిటీలతో ఇబ్బంది పడిన ప్రజలు.. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో అనేక ప్రయోజనాలు పొందుతున్నారు.



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా (ఫైల్)

ఎమ్మెల్యే రాజా చొరవతో..



గ్రామాల్లో ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో ఆలయాల నిర్మాణం జరగలేదు. ఎమ్మెల్యే రాజా చొరవతో ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి, ప్రజలు సన్మార్గంలో నడవడానికి ఆలయాలు ఉపయోగపడతాయి.

– నక్కా రాంబాబు, ఏఎంసీ చైర్మన్

అభినందనలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు, ఆధ్యాత్మిక భావన వృద్ధి చెందుతోంది. దానిలో భాగంగానే ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కృషితో ఆలయాలకు కొత్తశోభ వస్తోంది. టీటీడీ, శ్రీవాణీ ట్రస్టులు నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందిస్తున్నాం.

– కర్రి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ, కోరుకొండ

జగనన్న సురక్షను పటిష్టంగా అమలు చేయాలి



గోకవరం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత వీరబాబు

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ రవాణా సదుపాయం



ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోకతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఆర్టీసీ డీపీటీఓకి దృష్టికి పలు సమస్యలు

రాజమహేంద్రవరం సిటీ: రవాణా సదుపాయం లేక విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాజానగరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరంలో ఆర్టీసీ డీపీటీఓ అశోక షర్మిల దృష్టికి బుధవారం వివిధ గ్రామాల్లో విద్యార్థులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకువచ్చారు. ఈ గ్రీవెన్స్‌కు రాజానగరం నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, గ్రామపెద్దలు హాజరయ్యారు. తమ గ్రామాలకు రద్దు చేసిన సర్వీసుల పునరుద్ధరణతో పాటు కొన్ని కొత్త రూట్లలో సర్వీసులు ప్రారంభించాలని కోరారు.

బస్సులు లేక అవస్థలు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించినప్పుడు పలువురు విద్యార్థులు, ప్రజలు బస్సు సర్వీసులు లేక పడుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. కోవిడ్ సమయంలోనూ, రోడ్లు పాడైన సందర్భంగా పలు ఆర్టీసీ సర్వీసులను అధికారులు రద్దు చేశారని, దీనివల్ల పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారన్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రవాణా సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బంది పడకూడదని, విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో సమస్య పరిష్కరించడానికి ఆర్టీసీ డీపీటీఓ దృష్టికి సమస్యలు తీసుకొచ్చామన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి సమస్యలపై విన్నవించామన్నారు. రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దృష్టికి కూడా ఈ సమస్యలను తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్నం, అసిస్టెంట్ డిపో మేనేజర్ అజయ్ బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్రీవెన్స్‌కు తెలిపిన సమస్యలు

- గోకవరం బస్టాండ్ నుంచి చీపురుపల్లి వరకూ నడుస్తున్న బస్సును సీతానగరం, ముగ్గళ్ల, కాటవరం మీదుగా గోకవరం బస్టాండ్ వరకు తిప్పాలి. దీనివల్ల సుమారు 20 గ్రామాల ప్రజలకు సౌకర్యం కలుగుతుంది.
- గోకవరం నుంచి తంటికొండ, కోటి కేశవరం, చీపురుపల్లి, సీతానగరం మీదుగా పురుషోత్తపట్నం వరకూ బస్సు సర్వీస్ నడపాలి.
- కోరుకొండ మండలం బుచ్చింపేట నుంచి రాజమహేంద్రవరం వరకూ బస్సు వేయాలి.
- కొత్త తుంగపాడు, పాత తుంగపాడు, రాధేయపాలెం, శ్రీకృష్ణపట్నం, శ్రీరామపురం, దివాన్ చెరువు, హౌసింగ్ బోర్డు కాలనీ, కంబాల చెరువు మీదుగా రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్టాండ్ వరకూ సర్వీస్ నడపాలి.
- రాజమహేంద్రవరం నుంచి సంపత్ నగరం మీదుగా ద్వారపూడి వరకూ బస్సు సర్వీస్ నడపాలి.
- శ్రీరంగపట్నం నుంచి తుని వరకూ గతంలో ఉన్న బస్సును పునరుద్ధరించాలి. దానివల్ల అన్నవరం వెళ్లే భక్తులకు సౌలభ్యంగా ఉంటుంది. అలాగే బస్టాండ్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి.
- రాజమహేంద్రవరం నుంచి గోకవరానికి అనేక బస్సు సర్వీసులు ఉన్నప్పటికీ గుమ్మల దొడ్డి, అచ్యుతాపురం వద్ద రిక్వెస్ట్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలి.
- గోకవరం నుంచి జగ్గంపేట వయా గాదరాడ బస్సు సర్వీస్ నడపాలి.

బాధితురాలికి చేయూత



బాధితురాలికి బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న పేదల సంఘం సభ్యులు

గోకవరం: స్థానిక కుమ్మరిపేటలో నీలపు ఏసమ్మకు చెందిన ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన పేదల సంఘం స్వచ్ఛంద సంస్థ సభ్యులు బుధవారం బాధితురాలికి 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వరసాల ప్రసాద్ మాట్లాడుతూ తమ సంఘం పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కర్రి సూరారెడ్డి, బిజ్జి రాజు, బొర్రా రాజేష్, బొడ్డపాటి వీరచంద్రం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురికి జైలు

కంబాలచెరువు: ఒక వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఒకరికి ఐదేళ్లు, ఇద్దరికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా.. సుబ్బారావు నగర్‌కు చెందిన దడాల సత్యనారాయణ 2019 నవంబర్ 28న తాను కుట్టిన దుస్తులు తీసుకుని సీటీఆర్ఐ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి వస్తూ.. దుర్గగుడి సెంటర్ వద్ద అష్టాచెమ్మా ఆడుతున్న తాటితోట ప్రాంతానికి చెందిన బంగారు అయ్యప్ప, రాయి సింహాద్రి, రాయి వెంకటేశ్వరరావు వద్దకు వెళ్లాడు. అక్కడ ఆట చూస్తున్న సత్యనారాయణపై ఆ ముగ్గురూ దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అతని జేబులోని రూ.230 లాక్కుని, తలపై కర్రతో తీవ్రంగా కొట్టారు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన సత్యనారాయణను చుట్టుపక్కల వారు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా, బాధితుడు కోలుకున్నాడు. దీనిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు కోర్టులో బాధితుడి తరఫున వాదనలు వినిపించారు. కేసుకు సంబంధించి త్రీటౌన్ సీఐ జి.మధుబాబు ఆధారాలు అందించారు.

కష్టపడి పనిచేసేవారికి పార్టీలో గుర్తింపు

అనపర్తి: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కష్టపడి పనిచేసే ప్రతిఒక్కరికీ పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన అనపర్తికి చెందిన పాదూరి డేవిడ్‌రాజు అభినందన సభ మంగళవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి డేవిడ్‌రాజు పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. అనంతరం డేవిడ్‌రాజును పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, చేనేత విభాగం కన్వీనర్ పెనుగొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



డేవిడ్‌రాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

మధురపూడికి విద్యుత్ వెలుగులు

మధురపూడి: గ్రామాల్లో వసతుల కల్పనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగానే మధురపూడి గ్రామానికి వెళ్లే దారిలో రెండు కిలోమీటర్ల విద్యుత్ స్తంభాలు వేయించింది. దీంతో ఆ గ్రామస్తులకు రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి. కోరుకొండ మండలం మధురపూడి వాసులు మెయిన్ రోడ్డు నుంచి రెండు కిలోమీటర్లు దూరం ఊర్లోకి నడిచి వెళ్లాలి. పగలు బాగానే ఉన్నా, రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో విమానాశ్రయం విస్తరణతో గ్రామానికి వెళ్లే రోడ్డు, విద్యుత్ లైట్లు ఉన్న భూభాగం పోయింది. విమానయాన శాఖ అధికారులు తీసుకున్న రోడ్డు, విద్యుత్ స్తంభాలకు ప్రతిగా రోడ్డు నిర్మాణంతో లైటింగ్ సదుపాయం కల్పిస్తానన్నారు. కానీ కాలయాపన చేశారు. దీంతో స్థానికుల సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా లైటింగ్, రోడ్డు నిర్మాణం కోసం కృషి చేశారు. మెయిన్ రోడ్డు నుంచి గ్రామానికి రెండు కిలోమీటర్లు వరకూ 32 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. దీంతో దారిలో విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి.



మధురపూడి గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

అనపర్తి: మండలంలోని లక్ష్మీనరసాపురం వద్ద వేమగిరి–సామర్లకోట కెనాల్ రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. అనపర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం శివారు పెంటపాడు జువ్వలపాలెం గ్రామానికి దొడ్డు దాసు, ఐ.రాజేష్‌లు బంధువులను పరామర్శించేందుకు గాను ద్విచక్రవాహనంపై సామర్లకోట మండలం జి.మేడపాడు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం వంతెన వద్దకు వచ్చేసరికి ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న బిక్కవోలు గ్రామానికి చెందిన ఉల్లిశెట్టి సురేష్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకుల తలలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గాయపడిన సురేష్, దాసుల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.



లక్ష్మీనరసాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

ఎగ్జిబిషన్‌లో అనాథ పిల్లల సందడి

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ ఫిష్ టన్నల్‌ను మంగళవారం రాత్రి ఏకలవ్య చిల్డ్రన్స్ హోమ్ అనాథ శరణాలయం పిల్లలతో కలిసి ఎంపీ భరత్ రామ్ సందర్శించారు. పిల్లలతో కలిసి ఆనందంగా సందడి చేశారు. ఓ దివ్యాంగ బాలిక ట్రై సైకిల్‌ను నడిపించుకుంటూ ఆయన ఎగ్జిబిషన్‌లోకి వచ్చారు. హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు అనూప్ జైన్, ధర్మేంద్ర జైన్ ఈ పిల్లలందర్నీ ఇక్కడకు తీసుకొచ్చారని, ఈ చిన్నారులతో కలిసి ఎగ్జిబిషన్ తిలకించడం మరచిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీతో పలువురు సెల్ఫీలు దిగారు.



ఎగ్జిబిషన్‌లో చిన్నారులతో ఎంపీ భరత్‌రామ్

ప్రతిపక్షాల ఆరోపణలు అనైతికం

సీటీఆర్ఐ: జగన్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలను ప్రతిపక్షాలు మానుకోవాలని హితకారిణి సమాజం ట్రస్టు బోర్డు డైరెక్టర్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కందుకూరి విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులకు భద్రత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దన్నారు. ముఖ్యమంత్రి జగన్ తమ ట్రస్ట్‌బోర్డును నియమించడానికి ముందే ప్రస్తుత ఎంబీఏ కాలేజీ ప్రిన్సిపాల్ వి.విద్యా ప్రతిమను కళాశాల నిబంధనలకు వ్యతిరేకంగా అపాయింట్ చేశారని, ఉద్యమ నాయకుడు కార్తీక్ సింగంపల్లి ప్రశ్నించేంతవరకు వాస్తవాలు తమకు తెలియకుండా ఆమె జాగ్రత్త పడ్డారన్నారు. అనంతరం ఆమె సమావేశంలో తప్పు ఒప్పుకుని రాజీనామా చేస్తానని చెప్పడంతో సమస్య ముగిసిందన్నారు. తమ హయాంలో జరగని తప్పులను కూడా ముడిపెట్టి టీడీపీ నేతలు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ ఉమెన్స్ హాస్టల్ విషయాన్ని స్వయంగా పరిశీలించి ఇబ్బందులు లేకుండా హితకారిణి సమాజం ఆధ్వర్యంలో రన్ చేయాలని సూచించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు డైరెక్టర్లు దేవులపల్లి సరితారాణి, గుడాల ఆదిలక్ష్మి, కాలచర్ల శివాజీ, ఉండ్రు సత్యనారాయణ, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో బుధవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ ఇంటింటి సర్వే నిర్వహించి, జ్వరం కేసులు ఉంటే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు రిఫర్ చేయాలన్నారు. నగరంలో అర్బన్ హెల్త్ సెంటర్లకు టైఫాయిడ్ నిర్ధారణ కిట్లు వెంటనే సరఫరా చేయాలని జిల్లా వైద్యశాఖాధికారిని కోరారు. సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

- బంగారు కొండ పథకంలో భాగంగా తాము దత్తత తీసుకొన్న గోర్రక్షణపేటలోని షేక్ ఫారూక్, గోపాల్ నగర్ పుంతలోని కొవ్వాడ దీక్షిత గృహాలను కమిషనర్ సందర్శించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి, ఆ పిల్లల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు తగిన తోడ్పాటు అందించాలని కోరారు.
- 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈనెల 30వ తేదీలోగా వడ్డీ లేకుండా చెల్లించే అవకాశం ఉందని కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. జూలై ఒకటి నుంచి నూటికి రూ.2 చొప్పున వడ్డీ విధించబడుతుందన్నారు. పన్ను నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌంటరులోనే కాకుండా అన్ని సచివాలయాలు, ఆన్‌లైన్, చెక్కుల ద్వారా చెల్లించవచ్చునన్నారు.



చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న కమిషనర్ దినేష్ కుమార్

తెలుగు హాస్యంపై నిండైన సంతకం ముళ్లపూడి

సీటీఆర్ఐ: తెలుగు హాస్యంపై నిండైన సంతకం ముళ్లపూడి వెంకటరమణ అని వక్తలు కొనియాడారు. స్థానిక కంటే వీరన్న చౌదరి ఆసుపత్రి పైనగల బాలు సాంస్కృతిక మందిరంలో రాజమహేంద్రవరం ఆర్ట్స్, క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) సంస్థ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ పాత్రికేయుడిగా, రచయితగా, సినీరచయితగా ఆయన చేసిన పనిలోనూ హాస్యాన్ని మనకు అందించారన్నారు. రాకా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి మాట్లాడుతూ గోదారోళ్ల ఎటకారం, మమకారం, నిండుగా ముళ్లపూడి వెంకటరమణ రచనల్లో ప్రతిబింబిస్తాయన్నారు. కార్యక్రమంలో సాహితీ గౌతమి అధ్యక్షుడు పి.విజయకుమార్, సాహితీవేత్త మహ్మద్ ఖాదర్ ఖాన్, కృష్ణ మోహన్, జీవీ.రమణ, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



రచయిత సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రముఖ రచయిత వారణాసికి సన్మానం

ప్రముఖ పాత్రికేయుడు, రచయిత వారణాసి సుబ్రహ్మణ్యాన్ని విశిష్ఠ అతిథిగా ఆహ్వానించి, ఆయనను మెమెంటో, శాలువాతో సత్కరించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వెంకటరమణ స్వీయ రచన కోతికొమ్మచ్చి చదివితే తన జీవితం మొత్తం తెలుస్తుందన్నారు. బాపు, వెంకటరమణ శరీరాలు వేరైనా ఆత్మలు ఒక్కటే అన్నారు. వెంకటరమణతో తనకి గల సాన్నిహిత్యాన్ని వివరించారు.

20 మందిపై కేసులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వేస్టేషన్‌లో అనుమతి లేకుండా విక్రయాలు జరుగుతున్న 20 మంది హాకర్లను పట్టుకుని, వారిని ఆర్‌పీఎఫ్ సిబ్బందికి అప్పగించినట్లు విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో ఈనెల 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు కేటరింగ్ స్టాళ్లు, ప్లాట్‌ఫాం, రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు.

రోగుల వివరాలు నమోదు చేయాలి

కంబాలచెరువు: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఐహెచ్ఐపీ పోర్టల్‌లో రోగుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, దీనిపై నిర్లక్ష్యంగా వహిస్తే సంబంధిత ఆసుపత్రుల నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా సర్వేలైన్స్ అధికారి డాక్టర్ టి.రాజీవ్ హెచ్చరించారు. స్థానిక ఐఎంఏ హాలులో బుధవారం ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక, అంటు, సీజనల్ వ్యాధులతో ఆసుపత్రిలో చేరే రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఐహెచ్ఐపీ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. సీనియర్ డాక్టర్ ధర్మరాజు మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 పబ్లిక్ హెల్త్ ప్రకారం రోగుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఎపిడిమాలజిస్ట్ సుధీర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లా మలేరియా అధికారి పి.వీర్రాజు నమోదు చేసిన వివరాలను బట్టి ఆయా ప్రాంతాలలో వ్యాధి తీవ్రత ఎలా ఉందో తెలుసుకుని ముందస్తు చర్యలు చేపట్టవచ్చన్నారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఎవరైనా అలసత్వం వహిస్తే సంబంధిత ఆసుపత్రులకు నోటీసులు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.